క్లుప్తంగా

పౌష్టికాహారం తప్పనిసరి



అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, చిన్నారులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి సూచించారు. మండలంలోని దన్నానపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం సరఫరా అవుతోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుద్ధి చేసే తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తర్లాడ జయమ్మ, నాయకుడు చిన్నంనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త జయప్రద, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా పయనించాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడవికొలను వెంకట్

డెంకాడ: విద్యార్థులు లక్ష్యం దిశగా పనిచేస్తే ఉజ్వల భవిష్యత్ సిద్ధిస్తుందని యూఎస్‌ఏకు చెందిన అడవికొలను వెంకట్ అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో అవరోధాలను అధిగమించడంపై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ మాట్లాడుతూ, గతం గురించి చింతించకుండా భవిష్యత్‌పై భరోసాతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం వెంకట్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి పి.దుర్గాశైలజ, ఫెమినావింగ్ కో ఆర్డినేటర్ పి.జానకి, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



రాధాదేవి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు పెనుమత్స, పాకలపాటి

నెల్లిమర్ల రూరల్: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలో మొయిద ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు బొట్టా రాధాదేవి ఉద్యోగ విరమణ సత్కార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఉపాధ్యాయురాలు రాధాదేవి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డైట్‌లో విద్య, పనిమేళా



మేళాను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు

నెల్లిమర్ల: వర్క్ ఆఫ్ డిగ్నిటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక డైట్‌లో విద్య, పనిమేళా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో కాగితం సంచులు, కాగితంతో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సిబ్బంది కె. రామకృష్ణ, రవికుమార్, వి. భారతి, డి. ఈశ్వరరావు, కమలకుమారి, కె. సూర్యారావు, ఎం. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



కార్నియా సేకరిస్తున్న అప్తాలమిక్ టెక్నీషియన్ రమణ

విజయనగరం ఫోర్ట్: నేత్రదానానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు అన్నారు. పట్టణంలోని సత్యా గ్రీన్ హైట్స్‌లో నివాసం ఉంటున్న సాగి అన్నపూర్ణ సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న రెల్లివలస పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.రాజ్‌కుమార్ నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో వారి అంగీకారం మేరకు రెడ్‌క్రాస్ ఐ డొనేషన్ సెంటర్ సిబ్బంది ఎ. రమణ, అధికారులు బి. వెంకటేశ్వరావు, బి. తారకేశ్వరావుల సమక్షంలో అన్నపూర్ణ కార్నియాలను సేకరించారు.

పర్యాటక ప్రాంతంగా విజయనగరం కోట

- ఉత్సవాల నాటికి సుందరీకరణ పూర్తి కావాలి
- ప్రతిరోజూ లైట్ అండ్ సౌండ్ షో నిర్వహణకు ఏర్పాట్లు
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



కోట సుందరీకరణ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం: నగరానికి చారిత్రక వారసత్వ సంపదగా ఉన్న కోటను సుందరీకరణ చేసి మంచి పర్యాటక స్థలంగా తీర్చిదిద్దనున్నట్టు కలెక్టర్ డా.బి.ఆర్. అంబేడ్కర్ స్పష్టంచేశారు. అక్టోబర్ నెలలో జరగనున్న విజయనగర ఉత్సవాలలోపే సుందరీకరణ పనులు పూర్తిచేసి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి కలెక్టర్ సోమవారం కోట వెలుపలి ప్రాంతాన్ని సందర్శించారు. కోట గోడచుట్టూ సుందరీకరణకు చేయాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. సుందరీకరణ పనులను అక్టోబర్ 10వ తేదీ నాటికి పూర్తిచేసి ఉత్సవాల్లో సందర్శకుల కోసం సిద్ధం చేయాలన్నారు. సుందరీకరణ పనులు మంగళవారం నుంచే ప్రారంభం కావాలని ఆదేశించారు. ఆర్డీఓ ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలన్నారు. కోట గోడపై అన్నివైపులా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కోట చుట్టూ ఉన్న కందకాలను స్వచ్ఛమైన నీటితో నింపి లాన్‌తో అందంగా తీర్చిదిద్దాలన్నారు. కోట గోడను ఆనుకొని వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలంలో సందర్శకులు కూర్చొనేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోటకు దక్షిణంవైపున ప్రతిరోజూ లైట్ అండ్ షో నిర్వహించి విజయనగరం చరిత్ర, వైభవాన్ని సాయంత్రం వేళల్లో లేజర్ షో ద్వారా ప్రదర్శించేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆ 16 కుటుంబాలను అక్కడి నుంచి తరలించండి

దక్షిణంవైపు కోట సుందరీకరణలో భాగంగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న 16 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని విజయనగరం తహసీల్దార్‌ను కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోనియానగర్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను వారికి కేటాయించాలని సూచించారు. వారంలోగా వారంతా అక్కడికి తరలివెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా ఇళ్లలో నివాసానికి అనువుగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. ఈ పర్యటనలో ఆర్డీఓ దాట్ల కీర్తి, సీపీఓ పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, మాన్సాస్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్, తహసీల్దార్ కూర్మనాథరావు, పూసపాటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



రక్షిత మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు

విజయనగరం: నగర వ్యాప్తంగా జరుగుతున్న నీటి పంపిణీ విధానంపై అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ సిబ్బంది, ఎమినిటీస్ కార్యదర్శులకు కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. నగరంలోని పలు వాటర్ ట్యాంకులను సోమవారం శుభ్రపరిచారు. ఇటీవల కార్యదర్శులతో చేపట్టిన సమీక్షలో కమిషనర్ ఇచ్చిన ఆదేశాలతో సిబ్బంది వాటర్ ట్యాంకులను శుభ్రపరిచారు. బాబామెట్ట, జమ్ము, పూల్‌బాగ్, కొత్తపేట వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరిచారు.

రక్షిత మంచినీటి పథకాల పరిశీలన..

విజయనగర ప్రజలకు నీరు అందిస్తున్న నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాలను కమిషనర్ నల్లనయ్య సోమవారం పరిశీలించారు. నీటి పంపిణీ విధానం, నీటి సామర్థ్యం అంతా ఆశాజనకంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నెల్లిమర్ల వాటర్ హెడ్ వర్క్స్ వద్ద సైనేజ్ బోర్డు సరిగా లేదని, అలాగే ప్రహరీ లేకపోవడాన్ని గమనించి వెంటనే వాటి ఏర్పాటుకు అవసరమైన అంచనాలను తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతంలో చెత్తాచెదారాలు పేరుకుపోవడటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

- వీధిలైట్ల సమస్య పరిష్కారం కాకపోవడంపై కౌన్సిలర్ల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని సమస్యలపై వెంటనే స్పందించాలని కమిషనర్ అప్పలరాజుకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో చాలా చోట్ల వీధి లైట్లు వెలగడం లేదన్నారు. మెటీరియల్ కొనుగోలుకు టెండర్లు పిలిచినా ఇంతవరకు కొనుగోలు చేయలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎవరైనా ఇల్లు నిర్మించుకుంటే ఇప్పటివరకు అగ్రిమెంట్ సమర్పించేవారని, ఇకపై అలా చేయనక్కర్లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మొయిద జంక్షన్‌లో నిర్మించిన అనధికార భవనంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. పట్టణంలో కొంతమంది నాయకులు దందాలు చేస్తున్నారని, సొంత స్థలాల యజమానులను సైతం బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అన్న క్యాంటీన్ భవన నిర్మాణంపై సంబంధిత కాంట్రాక్టర్ లెంక అప్పలనాయుడును ఆరా తీశారు. ఇంకా నిర్మాణం పూర్తి కాలేదని, పది రోజుల్లోగా భవనాన్ని అప్పగిస్తామని కాంట్రాక్టర్ చెప్పారు. చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ కె.అప్పలరాజు, మేనేజర్ విశ్వేశ్వరరావు, వైస్‌చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గౌరవం

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త సూర్యారావు



రమణరాజు, రాధిక దంపతులను సన్మానిస్తున్న అధికారులు

భోగాపురం: అంకితభావంతో పనిచేసినప్పుడే గౌరవం లభిస్తుందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం. భారతి అన్నారు. సోమవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సహిత విద్య ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన డీవీ రమణరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రమణరాజు దివ్యాంగ విద్యార్థులకు అందించిన సేవలు మరువలేవన్నారు. అనంతరం పదవీ విరమణ చేసిన రమణరాజు మాట్లాడుతూ.. విద్యాశాఖాధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయుల సహకారంతో మండలంలో సుదీర్ఘ కాలం పని చేశానని చెప్పారు. ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని ఇంత ఘనంగా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు పడాల చంద్రశేఖర్, ఆళ్ల వైకుంఠరావు, ప్రసాదరావు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

విజయనగరం ఫోర్ట్: అక్టోబర్ 11 అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సాంస్కృతిక పాఠశాలలో 'ఆడబిడ్డను కాపాడండి' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, డెమో వి.చిన్నతల్లి , డిప్యూటీ డీఈఓ.కె. వెంకటరమణరావు, ఎంఈఓ -1 టి. ఆనందమూర్తి, ఎంఈఓ-2 సత్యవతి, ప్రిన్సిపాల్ లలితకుమరి, హెల్త్ ఎడ్యుకేటర్ చాముండేశ్వరి, మానటరింగ్ కన్సల్టెంట్ ఎ. పవన్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న విశ్వ హిందూపరిషత్ కార్యకర్తలు

విజయనగరం అర్బన్: ప్రభుత్వం నుంచి దేవాలయాలను విముక్తి చేయాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యవర్గం సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రధానమైన 20 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ విజయనగరం ప్రాంత ధర్మ ప్రచార విభాగ్ ప్రముఖ్ పాగిరి సూర్యనారాయణ, విభాగ కార్యదర్శి కాళ్ల నాగభూషణరావు, జిల్లా కార్యదర్శి అప్పారావు, జిల్లా కోశాధ్యక్షుడు చలమయ్య, జిల్లా మందిర అర్చక పురోహిత ప్రముఖ్ నాగరాజుశర్మ, జిల్లా సత్సంగ ప్రముఖ్ నాగేశ్వరావు, జిల్లా సహకార్యదర్శి అప్పికొండ సన్యాసిరావు, జిల్లా బజరంగదళ్ అమర రామకష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథా గానం

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక చదురుగుడి, వనంగుడి ఆవరణలలో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి. చదురుగుడి ఆవరణలో ప్రముఖ హరికథా కళాకారిణి కాళ్ల నిర్మలా భాగవతారిణి నిర్వహించిన హరికథాగానాలాపన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పి.చిన్నతల్లి భక్తిగీతాలాపన చేశారు. అదేవిధంగా రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో చదలవాడ ప్రసాద్ ఆధ్యాత్మిక ప్రసంగం ఆహూతులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. నర్సీపురానికి చెందిన నడితోక రూపకుమారి హరికథ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

- కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారికి సమ్మె నోటీసు అందజేత



కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి సాంబమూర్తికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, పర్మినెంట్ పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, లేని ఎడల ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మె చేపట్టక తప్పదని ఏఐటీయూసీ నాయకులు ఎస్. రంగరాజు, జలగడుగుల కామేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి కొండపల్లి సాంబమూర్తిని సోమవారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్మినెంట్ కార్మికులకు మూడు సంవత్సరాల సరెండర్ లీవ్ సొమ్మును తక్షణమే విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు హెల్త్ అలవెన్స్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అలాగే చనిపోయిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని.. పారిశుధ్య కార్మికులు పదవీ విరమణ పొందితే రూ.75 వేలు, చనిపోయిన వారికి రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు. విజయనగరం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 11 మంది సూపర్‌వైజర్లకు జీఓ అమలు చేసినప్పటి నుంచి రూ.18,500 జీతాన్ని మంజూరు చేస్తూ ఏరియర్స్ కూడా ఇవ్వాలన్నారు. ప్రతి సచివాలయంలో 15 మంది కార్మికులుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె. శ్రీను, టి.శ్రీను, డి.రాజు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా రాక్‌పార్కు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



రాక్‌పార్కు పరిసరాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: దక్షిణ భారతదేశంలో తొలి బొటానికల్ గార్డెన్‌గా పేరొందిన రాణి అప్పలకొండ రాక్‌గార్డెన్ పార్కును రెండు రోజుల్లో శుభ్రపరిచి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. రాక్ గార్డెన్ పార్కును సోమవారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పరిసరాల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే అక్కడున్న పారిశుధ్య కార్మికులు, గార్డెన్ పర్యవేక్షకుడిని పిలిచి మందలించారు. అనంతరం పలు వీధుల్లో ఆయన పర్యటించి పారిశుధ్య పనుల తీరును గమనించారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారికి అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోగా ఏర్పాట్లు

- ఆర్డీఓ దాట్ల కీర్తి

విజయనగరం అర్బన్: ఈనెల 14, 15 తేదీలలో జరగనున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ సంబరాలకు సంబంధిత శాఖాధికారులకు సంబంధించి అప్పగించిన పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆర్డీఓ డాక్టర్ కీర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె సంబంధిత శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావును ఆదేశించారు. రెండంచెల భద్రత ఏర్పాటు చేయాలని డీఎస్పీ ఎం. శ్రీనివాసరావుకు సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బయో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని పురపాలక సంఘ అధికారులను ఆదేశించారు. సిరిమాను తిరిగిన అనంతరం సకాలంలో విద్యుత్ పునరుద్ధరణ చేయాల్సిందిగా విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. పండుగ జరిగే రోజుల్లో మూడు షిఫ్టుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా సమాచార శాఖాధికారికి సూచించారు. నిర్ణీత సమయానికి సిరిమాను తిరువీధి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా దేవదాయ, అటవీ శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓ ప్రసాదరావు, వైద్యాధికారులు, పురపాలక సంఘ అధికారులు, విద్యుత్, రవాణా, ఎక్సైజ్ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గర్జించిన మహిళా లోకం..



మహిళా గర్జన పోస్టర్‌ను చూపిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

విజయనగరం టౌన్: మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన మహిళా గర్జన కార్యక్రమం విజయవంతమైంది. కోట వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీని వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను తీవ్రమైన సమస్యగా గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. లైంగిక దాడులకు పాల్పడే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. మహిళా గర్జన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాజీ చానెల్ కృషి అభినందనీయమన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని, అప్పుడే తప్పులు చేయడానికి భయపడతారని అభిప్రాయపడ్డారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ , చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు మాట్లాడుతూ.. చట్టాలను పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలు, మహిళా గర్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కబేళాపై పోలీసుల దాడి

- 30 ఆవులు, మూడు వేల కిలోల మాంసం పట్టివేత



కబేళాలో ఉన్న 30 ఆవులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖ టాస్క్‌ఫోర్స్ విభాగం, వన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా ద్వారపూడి రోడ్డు కేఎల్ పురం శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కబేళాపై ఆదివారం అర్ధరాత్రి దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటరావు, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నరేష్, ఇతర సిబ్బంది కలిసి దాడులు చేపట్టి ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే 30 ఆవులను రక్షించడంతో పాటు సుమారు మూడు వేల కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే 8 వాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం అందజేత



క్రీడాకారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన పలువురు క్రీడాకారులకు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి రూ.50 వేల ప్రోత్సాహకం అందజేశారు. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, అక్టోబర్ 6వ తేదీ నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ఎమ్మెల్యే నాగమాధవి నగదు ప్రోత్సాహకాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ చల్లా రాము, నగర పంచాయతీ కమిషనర్ కె. అప్పలరాజు, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, ఎంఎం నాయుడు, రవ్వా నాని, తదితరులు పాల్గొన్నారు.

చెవులకు ఎంతో ప్రాధాన్యం..

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: పంచేంద్రియాల్లో చెవులకు ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొపెసర్ (ఈఎన్‌టీ విభాగం) డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక సర్వజన ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో చెవుడు నివారణ దినం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వినికిడి శక్తి లేకపోతే దైనందిన జీవితంలో చాలా కోల్పోతామన్నారు. బాగున్న వినికిడి శక్తి చేజేతులా మనమే పాడుచేసుకుంటున్నామని తెలిపారు. డీజే సౌండ్స్, బాణసంచా, ఫ్యాక్టరీ హారన్‌లు, వాహన శబ్దాల వల్ల వినికిడి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ఇయర్ ఫోన్స్ ఎక్కువగా వినియోగించడం వల్ల కూడా వినికిడి సమస్యలు వస్తున్నాయన్నారు. వినికిడి సమస్య నివారణకు ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమావేశంలో డాక్టర్ దశరథ్, డాక్టర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కమిషనర్ నల్లనయ్య వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 15వ నంబర్ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని.. అలాగే 55వ నంబర్ సచివాలయ పరిధిలో నీరు నిలిచిపోయిందని, 11, 12 సచివాలయాల పరిధిలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఈఈ కె. శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, మేనేజర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ఆర్‌జేసీ



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జేసీ మూర్తి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని ద్వారక తిరుమల రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ మాట్లాడుతూ.. అమ్మ వారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.